## ముసలి భర్తను వదిలించుకోడానికి ప్రియుడితో ఆమె వేసిన పథకం ఫలించిందా?

# జజ్జర

### యర్రగుంట్ల సూర్యమూర్తి కథ

మీరు చూసేరో లేదో గాని సంయుక్త చాల అందంగా వుండేది. ఆమె పెద్దకళ్లలోని అమాయకత్వం చూస్తే ఆమెను దగ్గరగా తీసుకుని, ఈ కర్కశమైన ప్రపంచం నుండి కాపాడాలనిపిస్తుంది. అప్పుడప్పుడే వయస్సు వస్తున్న రోజుల్లో నేను సంయుక్తను బాగా ఎరుగుదును. తరువాత విధివశాన్న విడిపోయేం. సంయుక్తను మరచిపోవడానికి ప్రయత్నిస్తుంటే మళ్లీ నాలుగేళ్ల తరువాత హఠాత్తుగా రాజమండ్రి రైల్వేస్టేషన్‌లో కనిపించింది

నేను ఆఫీసు పనిమీద విశాఖపట్నం నుండి విజయవాడకు పోతున్నాను. సిగరెట్ల కోసమని కిటికీలో నుండి ప్లాట్‌ఫారమ్‌పైకి చూస్తుండగా, సంయుక్త ఎవ్వరినో బండి ఎక్కిస్తూ నా పక్క భోగీ వద్దే నించునుండడం కనిపించింది. నేను వెంటనే బండీ దిగి ఆమె దగ్గరకు వెళ్లాను.

సంయుక్త ఈ నాలుగేళ్లలో ఏమీ మారలేదు. అదే అందం, అదే చిరునవ్వు. అదే అమాయకత్వం! నిజం చెప్పాలంటే అప్పటి కన్నా ఇప్పుడే మరింత అందంగా తోచింది. ఆమె రాజమండ్రిలోనే ఉంటూందట. నేను విశాఖపట్నంలో టెలిఫోన్ ఎక్స్చేంజిలో జూనియర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నానని చెప్పేను.

"అదృష్టవంతుడివి, ఎంత జీతమొస్తుందేమిటి?" అని ప్రేమగా చూస్తూ అడిగింది సంయుక్త.

"సుమారుగా రెండువేలు. నువ్వెక్కడుంటున్నావీ ఊరులో?" అడిగేను.

సంయుక్త జవాబు చెప్పేలోగా బండీ



[illegible]
వైపుకి తిరిగి సంయుక్త మాట్లాడుతుంటే,
ట్రెయిను కూతబెట్టి కదలనారంభించింది.
గతుక్కుమని నేను నా బోగీనెక్కేను.

[illegible] ''సంయుక్తా! ఎక్కడ
మీ ఇల్లు?'' అడిగేను గట్టిగా.
''దానవాయిపేటలో'' అంది ఇటు తిరిగి.
ట్రెయిను ఆమెను దాటిపోతూంది.

''పెండ్లయిందా?'' కుతూహలాన్ని అణచుకోలేక అడిగేసేను.

''లేదు'' అని సన్నగా నవ్వింది.

''వీలు చూసుకుని వచ్చి కలుస్తాను''.

''తప్పకుండా రా'', అని రుమాలుతో చేతిని ఊపింది.

అంతే తరువాత మళ్లీ ఆరేళ్ల వరకూ నాకు సంయుక్త కనిపించలేదు. నేను ఆమెను కలియడానికి విజయవాడ నుండి తిరిగొచ్చినప్పుడు ప్రయత్నించేను. కాని ఆమె జాడ తెలియలేదు. నేనామె అందాన్నిన్నేళ్లు మరచిపోలేకపోయేను. ఏనాటికైనా సంయుక్తని నాదానిగా చేసుకోదల్చాను. రాజమండ్రి స్టేషనులో నేనామెను చూసిన ఆరేళ్లకు తలవని తలంపుగా హైదరాబాదులో అబీడ్స్ సెంటర్‌లో ఎదురైంది సంయుక్త.

ఇంకా సంయుక్త అంత అందంగానూ ఉంది. నిజం చెప్పాలంటే వయస్సుతోబాటు ఆమె సౌందర్యం మెరుగులు దిద్దుకుంది. ఆమెకిప్పుడు వయస్సు ఇరవై ఎనిమిది, నా వయస్సు ముప్ఫై రెండు. ఆమె లావణ్యానికి ముగ్ధుణ్ణయి అలా ఉండిపోయేను. అప్పుడు నా టెలికాం ఆఫీసు అబీడ్స్‌లో ఉంది. ఆఫీసయిపోగానే ఆ సాయంత్రమలా తీరుబాటుగా నడుకుంటూ వస్తుంటే నాకు సంయుక్త ఎదురైంది. నన్ను చూడగానే సంయుక్త ఆనందంతో అలా చూస్తూ ఆగిపోయింది.

ఆమె సోయగం, ఆ ఎత్తయిన వక్షస్థలం, నిండైన ఆమె రూపం, చక్కని ఆ చిరునవ్వు, ఆమె చూపులో స్ఫురించే ఆ అమాయకత్వం మాస్తుంటే నా శరీరం సంతోషంతో పులకించింది. దగ్గరగా వెళ్లి సంయుక్త రెండు చేతులూ పట్టుకున్నాను.

''ఎన్నాళ్లకు మళ్లీ కలిసేం, ఎక్కడ నుంచి సంయుక్తా?''

''మేమీ పట్నంలోనే ఉంటున్నాం, అమీర్‌పేటలో. నా స్నేహితురాలు ఊరుకు పోతుంటే నాంపల్లి స్టేషన్‌లో ఆమెను రైలును ఎక్కించి ఇలా వస్తున్నాను, అబీడ్స్‌లో కాస్త షాపింగు చేసుకుని పోదామని. మరి నువ్వెక్కడ నుండి?''

''నేను ఈ పట్నమొచ్చి ఆరు నెలలైంది. మా ఆఫీసు దగ్గరలోనే''.

''అవును నువ్వు టెలిఫోన్స్‌లో జూనియర్ ఇంజనీరుగా పనిచేస్తున్నానన్నావు గదూ ఆనాడు రాజమండ్రిలో? ఏమైనా ప్రమోషను వచ్చిందా'' అభిమానంగా అడిగింది.

''లేదింకా, మరో రెండేళ్లకు గాని ప్రమోషను ఇవ్వరు. రోడ్డుప్రక్కనే నిల్చిపోయేం, పద అలా హోటలుకి పోయి కాఫీ తాగుతూ మాట్లాడుకుందాం.''

ఇద్దరం చేరువలోనున్న బృందావన హోటలుకిపోయి టిఫెను, కాఫీ పుచ్చుకుని ఏవేవో చిన్ననాటి ముచ్చట్లు చెప్పుకున్నాం. తరువాత బజారుకుపోయేం. సంయుక్త ఏవో టాయిలెట్ సామాన్లు, ఒక నైట్ గౌను కొనుక్కుంది. ఆమె వద్దంటున్నా నేనే బిల్లు చెల్లించేను, ఇన్నాళ్లకు మళ్లీ కలిసేం అన్న ఉత్సాహంతో.

''నువ్వు తప్పకుండా మా ఇంటికి రావాలి. అమీర్‌పేటలో రవి మెడికల్ షాపు ఎదురుగా నున్న బంగళావే మాది'', అని చెప్పింది సంయుక్త.

"సరే, ఎల్లుండి తప్పకుండా మధ్యాహ్నం నాలుక్కి వస్తా''.

సంయుక్త ఆటోలో వెళ్లిపోయింది. నేను కోటీ దగ్గరున్న నా ఇంటికి పోయేను. ఆ రాత్రి సరిగా చాల సేపటి వరకు నాకు నిద్ర పట్టనే లేదు. సంయుక్త గురించే నా తలపులన్నీ. నా జ్ఞాపకాలు గతంలోకి పరుగెత్తాయి మనోవేగంతో.

* * *

నేను మొదట సంయుక్తను కలిసిన నాటికి సంయుక్తకు పదహారు, నాకు ఇరవై సంవత్సరాల వయస్సు. మా పెద్దనాన్నగారు పద్మనాభపురంలో వ్యవసాయాన్ని చూసుకునే వారు. అతనికక్కడ నలభై ఎకరాల మంచి మాగాణి ఉండేది. అతని పొలాలకు ఆనుకునే ఓ ఏరు, ఏరు దాటితే మామిడి తోటలు. నేనప్పుడు విశాఖపట్నంలో బి.ఎస్.సి. చదువుతుండేవాణ్ని. వేసవి సెలవులకు పద్మనాభపురానికి వెళ్లేను.

మా పెద్దనాన్నగారుండే వీధి చివరనున్న డాబా ఇంటిలో సంయుక్త ఉండేది తల్లితండ్రులతో. ఒక్కర్తే కూతురు, చాలా మురిపెంగా పెరుగుతుండేది. ఆమె తండ్రి భూస్వామి, బాగా కలిగినవాడే. సంయుక్త ఆ ఊరి హైస్కూల్లో తొమ్మిదో క్లాసు చదువుతుండేది.

నేను సంయుక్తను మొదటిసారి ఏటవతల ఉన్న మామిడి తోటలో చూసేను. మా పెద్దనాన్న కూతురు విశాలా, సంయుక్తా సమ వయస్కులు, తోటి విద్యార్థినులు, దగ్గర స్నేహితులు. నా చెల్లెలు విశాల నాకు సంయుక్తను పరిచయం చేసింది. వాళ్లకందని మామిడి కాయల్ని కోసిచ్చేవాడిని. చెట్టు క్రింద కూర్చుని వాళ్లు తెచ్చిన ఉప్పు కారం అద్దుకుని మామిడి ముక్కల్ని తినేవాళ్లం, అందో ఆనందం!

నాకు రోజూ సాయంత్రాలు అదో వ్యాపకమైపోయింది. సంయుక్త పదిరోజులలో నాకు బాగా చనువైపోయింది. సంయుక్త



పచ్చటి బంతిపువ్వులా ఉండేది. పెద్ద కళ్ల నుండి అమాయకంగా చూసేది ఆ పిల్ల. ఆ అమ్మాయిని చూస్తుంటే చేతుల్లోకి తీసుకుని ముద్దు పెట్టుకోవాలనిపించేది. ఒకనాడు సాహసించి ఆ పనే చేసేను.

నా చెల్లెలు విశాల దాహమంటే ఏటివద్దకుపోయి త్రాగి రమ్మని చెప్పి, నేనూ సంయుక్తా ఆ మామిడి తోటలో ఏదో మాట్లాడుతూ నించున్నాము. నన్ను వారం రోజులుగా వేధిస్తున్న కోరికను తీర్చుకునేందుకు అదే సరైన అదనని, సాహసించి సంయుక్తను కౌగిలించుకుని, గట్టిగా ఆమె పెదవులపై ముద్దు పెట్టుకున్నాను.

ముందు ఆశ్చర్యపోయి కండ్లను మరింత పెద్దవిగా చేసింది. తరువాత తేరుకుని నా కౌగిలిని విడిపించుకుని, నా ముఖంలోకి తీక్షణంగా చూసి నా చెంపను ఛెళ్లుమనిపించింది. చెంప చుర్రుమంది. బాధతోనూ, అవమానంతోనూ అలా ఆ చెట్టు మొదట కూర్చుండిపోయేను. సంయుక్త కోపంతో వెళ్లిపోయింది.

ఇంటికి వెళ్లడానికే చాలా సిగ్గుతో, భయంతో కృంగిపోయేను, ఎక్కడ తన తల్లితండ్రులతో వారిద్వారా నా పెద్ద నాన్నకు చెప్పించి నాకు చీవాట్లను పెట్టిస్తుందోనని. ఆ రాత్రి మరే తుఫాను రాలేదు. మెల్లగా నిద్రపోయేను. ఆ మరునాడు వాతావరణం ప్రశాంతంగానే ఉంది. అమ్మ! బ్రతికిపోయేననుకున్నాను.

రెండు రోజుల వరకూ సంయుక్త రాలేదు. మూడవ రోజున నా ప్రోద్బలం వల్ల నా చెల్లెలు విశాల వెళ్లి పిలిస్తే మామూలుగానే వచ్చింది. ఏమీ జరగనట్లు నాతో చిరునవ్వుతో మాట్లాడింది. మళ్లీ ముగ్గురం దూరంగా ఏటి ఒడ్డుకు పోయేం. అక్కడ వీలు చూసుకుని నన్నడిగింది సంయుక్త..

"నీ చెంప బాధించిందా?"

మూతి బిగించడం నా వంతయింది.

"సారీ! అనుకోకుండా కొట్టేసేను" అని తన మృదువైన చేతితో నా చెంపను నిమిరింది. నేను మరి నిగ్రహించుకోలేకపోయేను. ఆ చేతిని అందుకుని ముద్దు పెట్టుకున్నా అరచేతిలో. చటుక్కున వెనక్కి తీసేసుకుంది చేతిని.

"ఛా! ఛా! మళ్లీ అదే పనా? తప్పు కాదూ? నా కెందుకో ఈ ముద్దులు కౌగిలింతలంటే అసహ్యం. మరెప్పుడు అలా చెయ్యనంటేనే నీతో స్నేహంగా ఉంటాను, లేకపోతే నేను ఏటి ఒడ్డుకే రాను".

"సంయుక్తా! నీకు మాటిస్తున్నాను. నీ అనుమతి లేందే నిన్ను ముద్దు పెట్టుకోను సరేనా? ఇక్కడకు సాయంత్రాలు రావడం మాత్రం మానేయకు. నేను మరో వారం రోజులేగా ఇక్కడుండేది. మళ్లీ చదువులకు విశాఖపట్నానికి పోవాలి".

రోజులు హాయిగా, తొందరగా గడిచిపోయేయి. ఆ మరునాడే నేను విశాఖకు ప్రయాణమవాలి. ఆసరికి మా స్నేహాన్ని నా చెల్లెలు విశాల ఆమోదించి మేము సన్నిహితంగా కూర్చుని మాట్లాడుకుంటుంటే, దూరదూరంగా తిరిగి గడిపేది.

సంయుక్త నా తొడమీద తల పెట్టుకుని పడుక్కుంది. నేను చెట్టుకు చేరబడి

కూర్చున్నాను, నా చేతితో ఆమె బుగ్గల్ని మెల్లగా నిమురుతూ.

"సంయుక్తా! రేపే నేను వెళ్లి పోతున్నాను. నీకో విషయం నేను చెప్పాలి"

"ఏమిటది, మళ్లీ ఈ ఊరుకు రావా?"

"సంయుక్తా! నేను నిన్ను ఎంతగానో ప్రేమిస్తున్నాను. నా చదువైపోగానే మా వాళ్లకు చెప్పి నిన్ను పెండ్లాడుతా. అంత వరకు నువ్వు నా కోసం వేచి ఉంటావా? ఇంతకీ నీకు నా మీద ప్రేముందా?"

"ఆ.. ఎందుకు లేదూ? నువ్వంటే నాకిష్టమే".

అలా ఏవేవో మాట్లాడుకున్నాం. "మరి చీకటి పడ్తాంది. బయలుదేరుదామా?" అని లేచి కూర్చుంది. సరేనని ఇద్దరం లేచి నించున్నాము.

సంయుక్త హఠాత్తుగా నన్ను కౌగలించుకుని నన్ను ముద్దు పెట్టుకుంది. నేను ఆశ్చర్యపోయేను. నేను ఆ సన్నివేశాన్ని మరింత బలీయం చేసేలోగా, సంయుక్త చురుకుగా కదిలి నా చెల్లెలున్న చోటుకి పరుగెత్తింది.

ఆ తరువాత మా కుటుంబ పరిస్థితుల వల్ల, నా చదువు వల్ల మరి రెండేళ్లకు గాని నేనా గ్రామానికి వెళ్లడం తటస్థించలేదు. సంయుక్త మరింత అందంగా ఎదిగింది. యౌవ్వనంతో మిసమిసలాడుతూంది. వక్షం మరింత ఎత్తుగా ఆకర్షణీయంగా ఉంది. ఆ పెదవులను చూస్తేనే కొరికేయాలనిపించేది. ఆమె చిరునవ్వుల్లో, ఆ అమాయకపు చూపుల్లో ఎంతో సెక్సీగా తోచింది నాకు.

మా పెద్ద నాన్నగారింటికి సంయుక్త వస్తే అడిగేను మెల్లగా

"ఏం సంయుక్తా ఈ సాయంత్రం ఏటవతల తోటకు వస్తావా?"

"నేను బాగా ఎదిగిపోయేనని మా నాన్న, మేనత్త బయటకు పోనీయడం లేదు. నీకు తెల్సునో లేదో మా అమ్మ గత సంవత్సరం చనిపోయింది. ఆమె రెండు

## విడాకులు



ఏమిటీ! పిల్లాడు పుట్టాడని విడాకులిచ్చాడా, ఆశ్చర్యంగా అడిగింది... క్యాప్టెన్ మిసెస్‌ను ఇంకొక క్యాప్టెన్ మిసెస్.

"అవునండీ... ఆయన ఫ్యామిలీ ప్లానింగ్ చేయించుకొన్న సంవత్సరం తర్వాత వీడు పుట్టాడు" అసలు విషయం చెప్పి నాలిక్కొరుక్కుంది.

– డేవిడ్ రాజు (మణుగూరు)

సంవత్సరాలుగా కాన్సరుతో చాల బాధపడి మరణించింది. అప్పటి నుండి నా మేనత్తే ఇంటి విషయాలు చూసుకుంటుంది''.

''అయ్యో! మీ అమ్మగారు చనిపోయేరా, నాకు తెలియదు పాపం! నీకెంత కష్టం ప్రాప్తించింది.''.

''మురళీ! నిజం చెప్పాలంటే ఆమె జబ్బు బాధని చూడలేక మేమింటిల్లిపాదిమీ ఆమెకు మరణమే శరణ్యమనుకున్నాం. తల్లి లేని బాధ ఉందనుకో. ఏదో ఆ లోటు ఓ విధంగా అలవాటయిపోయింది ఈ సంవత్సరంలో.''

'అయితే ఏటి వద్దకు రాలేనంటావు'.

''అవును, మా వాళ్లకు తెలిస్తే నన్ను చాలా చీవాట్లు పెడ్తారు. ఇప్పుడు కూడా మీ చెల్లెలు వచ్చి పిల్చింది కాబట్టి నన్ను పంపేరు''.

ఏవేవో మాట్లాడుకున్నాం. ఆఖరికి నేనన్నాను..

''నా చదువైపోయింది. బి.ఎస్.సి. పరీక్షలు బాగా రాసేను. నాకు సంవత్సరంలోగా ఏదో ఒక ఉద్యోగం దొరక్కపోదు. నాకు ఉద్యోగం రాగానే నేను వచ్చి మన పెండ్లి గురించి మీ నాన్నగారితో మాట్లాడతాను ఏమంటావు?''

''నీ ఇష్టం''.

''అన్నట్లు సంయుక్తా మా పెద్ద నాన్న ఏదో చెప్పేరు, మీ నాన్నగారి ఆస్తి వ్యవహారాలలో ఏవో గొడవలొచ్చేయని, ఏమిటవి?''

''ఏముంది, మా నాన్నగారు పెంపకం వచ్చేరు. మా తాతగారి అనుయాయులకూ మా నాన్న గారికీ ఆస్తుల విషయంలో కోర్టుల్లో ఇన్ని సంవత్సరాలుగా ఏవో కేసులు నడుస్తున్నాయి.. అంతే''.

''సంయుక్తా! ఏమైనా ఓ సంవత్సరం ఓపిక పట్టు. మా వాళ్లేమీ మీ వాళ్లలా ఆస్తిపరులు కారుగాని వాళ్ల బతుకులు వారు బతక గల స్తోమతుంది వాళ్లకు. నాకేమీ కట్న కానుకలక్కరలేదు. నాకు ఉద్యోగం కాగానే నేను వచ్చి మీ వాళ్ల నొప్పించి నిన్ను పెండ్లాడుతా. నా పూర్తి జీతంతో మనిద్దరం హాయిగా గడపొచ్చు''.

ఏమిటో గాలిలో మేడలు కట్టేస్తున్నాం. ఎలా జరుగుతుందో ఏమిటో! ఎందుకేనా మంచిది పెద్ద ఉద్యోగం సంపాదించు'' అంది సంయుక్త పెంకిగా చూస్తూ చిరునవ్వుతో.

నేను ఈ మారు ఆ ఊరిలో ఓ వారం రోజులే ఉన్నాను. రోజుకోసారైనా మా పెద్దనాన్నగారింటికి వచ్చి ఓ అరగంట ఉండిపోయేది. ఆమెను తాకాలని ఎంతో కోరికగా ఉన్నా నాకు మా వాళ్లింట్లో ఆ అవకాశమే చిక్కలేదు.

ఒకనాడు గదిలో నేనూ సంయుక్తా, నా చెల్లెలి విశాలా కూర్చుని మాట్లాడుకుంటున్నాం. మంచినీళ్లు తెమ్మని చెల్లెల్ని ఇంట్లోకి పంపించేను. వెంటనే సంయుక్త అమాయకంగా నా ముఖంలోకి చూస్తూ ''దాహం వేస్తోందా?'' అని అడిగింది. నేను ఎంతో మత్తుగా ఆమె వైపు చూస్తూ తలాడించేను. దగ్గరగా వచ్చి తన ముఖాన్ని అందించింది. సంయుక్తను నా చేతుల్లోకి తీసుకుని తమకంతో ఆమె అధరామృతాన్ని గ్రోలేను.

ఇంతలో చెల్లెలు విశాల వస్తున్నట్లు అలికిడై దూరంగా జరిగి బుద్ధిగా కూర్చున్నాము. సంయుక్తలో అంతటి సరసముంది. అంతటి సెక్స్ అపీలుంది. సంయుక్త చిటికెన వ్రేలుతో పిలిచినా, నేను పరుగెత్తుకునిపోయి ఆమె ఒడిలో వాలగలను. అంతటి ఇంద్రియాకర్షణ ఆమెది. ఆమె పొంకమైన దేహం, ఆమె చక్కదనమటువంటిది.

మరో ఆరు నెలలకు గాని నాకు టెలిఫోన్స్‌లో ఉద్యోగం రాలేదు. తరువాత వెంటనే ఓ సంవత్సరం ఇంజినీరింగు ట్రెయినింగుకై జబల్‌పూర్ పోవల్సి వచ్చింది. నా ట్రెయినింగు పూర్తయి, నేను విశాఖపట్నం టెలిఫోన్స్‌లో ఉద్యోగంలో చేరి, నేను పద్మనాభపురం పోయేసరికి అంతా తారుమారైంది.

ఆ ఊరిలో సంయుక్త లేదు. కోర్టు కేసుల్లో సంయుక్త తండ్రి ఓడిపోయేడు. ఆస్తంతా పోయింది. ఆ దుఃఖభారంతో గుండెపోటు వచ్చి అతడు మరణించేడుట. ఆ మేనత్త ఆ ఊరిలో చేసేదేమీ లేక సంయుక్తను తీసుకుని రాజమండ్రి తన బంధువులింటికి పోయిందట. తరువాత నేను వీలు చూసుకుని రాజమండ్రిపోయి సంయుక్త గురించి వాకబు చేసేను కాని సంయుక్త జాడ తెలియలేదు. నేను నిరాశతో కృంగిపోయేను.

మళ్లీ కొన్ని సంవత్సరాలకు హఠాత్తుగా రాజమండ్రిలో కలిసింది. నాకు విజయవాడలో మూడు నెలలకుగాని ఆఫీసు పని ముగియలేదు. నేను తిరిగొచ్చి దానవాయిపేటలో సంయుక్త గురించి అడిగేను. కాని ఆమె ఆ ఊరు వదలి ఎక్కడికో పోయిందని తెల్సింది. అంతకు మించి వివరాలు దొరకలేదు. నా బాధ వర్ణనాతీతం. నా జీవితంలో సంయుక్తను మరువలేకపోతున్నాను.

ఇన్ని సంవత్సరాలు నేను సంయుక్తను తలవని రోజు లేదు. ఆమె దేహ మెత్తదనం, ఆమె పెదవుల తియ్యదనం తలుపుకురాని రాత్రి లేదు. ఆమె కోసం తపన

## వర్షం

భూగోళం మొత్తంపై ప్రతి ఏటా 5,25,100 ఘ.కి.మీ. వర్షం పడుతున్నది. కాని దీనిలో 23 శాతం అంటే 1,13,500 ఘ.కి.మీ. నీరు మాత్రమే మనం నివసించే భూమిపై పడగా మిగిలిన 77 శాతం తిరిగి సముద్రాల్లోనే పడుతున్నది.

—డాక్టర్ ఆళ్ల



చెందుతూ ఇన్నేళ్లు నేను వివాహం చేసుకోకుండా గడుపుకుంటూ వచ్చేను. ఏ నాటికైనా సంయుక్త కనిపించదా, ఆమెను నా దానిగా చేసుకోనా అన్న దృఢమైన ఆశతో ఇన్నేళ్లు నిరీక్షిస్తూ వచ్చేను.

ఆఖరికి ఈ విధంగా ఇద్దరం హైదరాబాద్‌లో కలిసేం. ఆమె నన్ను చూడగానే అదే ఆప్యాయతతో పలకరించింది. నా మీద ప్రేమ పోలేదింకా అనుకున్నాను. హోటల్లో కూర్చున్నప్పుడు ఎన్నో ప్రశ్నలను ఆమె గురించి వేయాలనిపించింది. కాని సాహసించి వెంటనే వెయ్యలేకపోయేను, పిడుగులాంటి ఏ జవాబు వినవల్సి వస్తుందోనని. సంయుక్త నా గురించి నన్నేమీ ప్రశ్నించలేదు

సంయుక్త నాకిచ్చిన ఎడ్రసు ప్రకారం ఆదివారంనాడు వెళ్లేను. అది ఓ మాదిరిగా పెద్ద ఇల్లే. చక్కని హాలు, హాలు మధ్యన చక్కని కార్పెటు, చుట్టూ ఖరీదైన ఫోమ్ సోఫాలున్నాయి. నేను సాయంత్రం నాలుగున్నరకు వెళ్లేను. ఆ సమయానికి సుందరంగా ముస్తాబై నా సుందరి సంయుక్త హాలులో కూర్చునుంది.

నన్ను చూడగానే ఎంతో అనురాగంతో ముందుకొచ్చి నా చేతుల్ని అందుకుని తీసుకుని వెళ్లి ఓ సోఫాలో కూర్చునబెట్టింది. ఎండలో వచ్చేనంటూ వెళ్లి ఫ్రిజ్‌లో నుండి రెండు లిమ్కా సీసాలు తెచ్చి గ్లాసులలో పోసి నాకొకటి అందించింది.

''ఇప్పుడడుగు నా గురించి ఏమడగాలని ఉబలాటపడుతున్నావో'' అంది కాస్త విచారంగా.

''ఈ ఐశ్వర్యమంతా నీదేనా?''

''అంతా నాదే. వీటన్నిటితోబాటు నాకో ముసలి మొగుడూ ఉన్నాడు'' అంది కార్పెటు వంక చూస్తూ విరక్తిగా.

నా తలమీద పిడుగు పడ్డట్టయింది. అలా శిలాప్రతిమలా ఉండిపోయేను. నేను కట్టుకున్న ఊహా సౌధలన్నీ కూలిపోయేయి. నేను ఎన్నో అంతస్తులపై నుంచి ఒరిగి నేలపైకి పడ్డట్టు బాధ పడజొచ్చేను. నిరాశల నిశీధిలో దారితోచక దిగులుతో అలా కూర్చుండిపోయేను.

ఆఖరికి కాస్త తేరుకుని అడిగేను కోపంతో—

''నా కోసం ఎన్ని సంవత్సరాలైనా వేచి ఉంటానని మాటిచ్చి నువ్విలా దగా చేస్తావనుకోలేదు ఇన్ని సంవత్సరాలూ నీ కోసం తపిస్తూ, మరో స్త్రీని పెండ్లి చేసుకోలేక నీ నామాన్నే జపిస్తూ, నీ కోసం నిరీక్షిస్తూ గడిపేసే— అట్లాంటిది నువ్వు పెండ్లి చేసుకుని సంపదలతో, భర్తతో హాయిగా కాలాన్ని వెళ్లబుచ్చుతున్నావు. ఎంత మోసం! అన్యాయం కాదూ?''

''నా మురళీ! ఆగ్రహపడకు— నా పరిస్థితులట్లాంటివి. అవి తెలుస్తే నువ్వు నాపైన జాలిపడక తప్పదు''.

నేనేమీ జవాబు చెప్పలేదు. ఆమె నిట్టూర్చి చెప్పుకుపోయింది—

''మా నాన్న కోర్టు దావాలలో ఓడిపోయారు. ఆస్తంతా పోయింది. ఆ దుఃఖాన్ని తట్టుకోలేక మరణించేరు. నాకు తల్లి లేదు, తండ్రి లేదు. బతకడానికి చేతిలో ఉన్న ధనం అంతంత మాత్రమే. గొప్పగా

బ్రతికిన ఊరిలో మరి తలెత్తుకుని గౌరవంగా జీవించలేక మా మేనత్త వెంట నేను రాజమండ్రికి చేరేను.


అక్కడ దానవాయిపేటలో ఓ చిన్నిల్లు తీసుకున్నాం. నా దగ్గరున్న నగలతో, మా వద్ద ఉన్న కాస్త డబ్బుతో జీవించనారంభించేము. నా మేనత్త ఇంట్లో పొటాటో చిప్స్, మిక్చరు తయారు చేసేది. వాటిని పాకెట్లలో పెట్టి సినిమా హాల్సుకూ, ఫాన్సీ షాపులకూ విక్రయించేదాన్ని. మాకు కిట్టే లాభం అంతంత మాత్రంగానే ఉండేది. నా చదువు స్కూలు ఫైనల్‌తో ఆగిపోయింది. నీ కోసం ఎంతో ప్రయత్నించేను. నీ చెల్లెలు విశాలకు రాసేను. విశాఖలో నువ్వు చదివేనన్న కాలేజీకి రాసేను గాని జవాబు రాలేదు. ఆ విధంగా నువ్వు నాకు దూరమయ్యేవు''.

''ఆనాడు మరి నువ్వు పెండ్లి కాలేదని రాజమండ్రి స్టేషనులో చెప్పేవు. నేను నా ఆఫీసు పని చూసుకుని తప్పకుండా తిరిగి నీ కోసం వస్తానన్నాను. మరి నా కోసం చూడలేకపోయేవా?''

''అదే చెప్తున్నాను విను. నేను ఉద్యోగం కోసం ఎన్నో ప్రయత్నాలు చేసేను దొరకలేదు. మూడు సంవత్సరాలయేక మా మేనత్త జబ్బు పడిపోయింది. ఆ చిప్స్ వ్యాపారమూ ఆగిపోయింది. చేతిలో డబ్బులు అయిపోవచ్చింది. అట్లాంటి సమయంలో మా ఇంటి ప్రక్కనున్నావిడను ట్రెయినెక్కించడానికి స్టేషనుకు నేను వచ్చినప్పుడు నువ్వెదురయ్యేవు. మళ్లీ ఆశల్ని పెంచుకున్నాను. నీ కోసం ఓ వెల్లాళ్ల ఎదురు చూసేను— గానీ నువ్వు రాలేదు''.

''నాకు విజయవాడలో వదలిపెట్టి రాలేని పని తగిలింది. అది పూర్తయి మీ ఊరికి వచ్చేసరికి మూడు నెలలు పట్టింది. ఈ లోగా నువ్వు అక్కడ నుండి మాయమయ్యేవు'' అన్నాను చిరుకోపంతో.

''నన్నేం చెయ్యమన్నావు చెప్పు— నాకేం చెయ్యడానికి తోచని పరిస్థితులలో మాకు



దావవాయిపేటలో తెల్సిన ఒకావిడ వాళ్ల బంధువొకాయన హైదరాబాదులో అడ్వొకేట్‌గా ఉన్నాడని, బాగా గడించేడని, వయస్సు 45 సంవత్సరాలుగాని దృఢంగా, ఆరోగ్యంగా ఉన్నాడని అతడిని చేసుకోమని వత్తిడి చేసింది. నేను చచ్చిపోతే నీకు దిక్కెవరే— నేను ఈ మాత్రం బతికుండగానే ఒక అయ్యను కట్టుకుని ఓ పంచను చేరవే, అని నా మేనత్త వంత పాడింది. చేసేది లేక ఆ పెండ్లికి ఒప్పుకున్నాను.''

''ఉద్ధరించేవు'' అన్నాను. నాకింకా ఆమెపై కోపం తగ్గలేదు.

''అతని మొదటి భార్యకు సంతానం లేదు. నా పెండ్లి నాటికి ఆమె చనిపోయి అయిదేండ్లు దాటేయి. అప్పట్లో అతని వయస్సు 45 సంవత్సరాలని దాచి చెప్పేరు. నిజానికి అతని వయస్సు 50 ఏళ్లు. తరువాత తెల్సింది నాకు. అంటే నా పెండ్లి నాటికి నా వయస్సు ఇరవై రెండు, అతని వయస్సు ఏభై. కాని నాకు వేరే గత్యంతరం లేకపోయింది. పెండ్లి కాగానే నా మేనత్తను తీసుకుని ఇక్కడకు వచ్చేసేం. మరో రెండు నెలలకే నా మేనత్త కన్ను మూసింది. నా పెండ్లయి ఆరేళ్లయింది. ఇన్ని సంవత్సరాలూ నేనెంత యాతన చెందేనో నువ్వూహించలేవు. ఆ బెంగలు, ఆ ఆందోళనలు తరువాత అసహ్యించుకుంటూనే ఈ రెండో పెండ్లి ముసలాడితో కాపురం ఎంత దుర్భరమో నీకేం తెల్సు— తలచుకుంటేనే ఒళ్లు జలదరిస్తుంది'' అని సంయుక్త కంటి వెంట నీరు కార్చింది.

నేను వెంటనే ఆమె వైపుకు జరిగి ఆమె తలను నా భుజం మీదకు చేర్చి ఆమె తలను నిమురుతూ ఓదార్చేను—

''ఐయామ్ సారీ సంయుక్తా! నీ పరిస్థితులు తెలియక నీమీద విసుగు చెందేను. మరి దుఃఖించకు. మన మొకటి తలుస్తే దైవమొకటి తలచేడు. విధి ఎలా నడిపిస్తే అలా నడిచే బొమ్మలం మనం''.

ఆ సానుభూతి వాక్యాలకే తృప్తి చెంది గువ్వపిట్టలా నా చేతుల్లో అతుక్కుపోయింది.

''సంయుక్తా! నీకేమైనా పిల్లలా?''

ఆ ప్రశ్నతో కాస్త దూరంగా జరిగి నా ముఖంలోకి చూస్తూ అంది—

''పిల్లలూ లేరు జల్లలూ లేరు. నీ వంటి యువకుడు కాదు నా భర్త. ఆ ముసలాడికి పిల్లలెలా కలుగుతారనుకున్నావు? ఏ సంతానం లేదు, ఏ సంతోషమూ లేదు. నా యవ్వనమిలా ఏడా పాలవ్వాల్సిందే'' అని ఎంతో వేదనతో చెప్పింది. ఏం మాట్లాడడానికీ నాకు తోచలేదు.

బయట ఆటో వచ్చిన చప్పుడైంది.

''అదిగో అతను వచ్చేరు— చూద్దువుగాని ఆ వాలకం'' అని ఈసడింపుగా అంది దూరంగా మరో సోఫాలో కూర్చుంటూ.

అతను హాలులోకి రాగానే నేను లేచి నుంచుని 'నమస్తే' చెప్పేను.

''ఇతను మా వారు నాగఫణిగారు— హైకోర్టులో అడ్వకేట్. ఇతను మురళిగారు — నా బంధువు మా గ్రామం వారు. ఇక్కడ టెలిఫోన్స్‌లో ఇంజనీరుగా పనిచేస్తున్నారు,'' అని సంయుక్త మా ఇరువురి పరిచయం చేసింది.

నాగఫణిగారు సన్నగా పొడవుగా ఉన్నారు. శరీర ఛాయ నల్లగా ఉన్నా అతను బాగానే ఆరోగ్యంగా ఉన్నట్లు నాకు తోచింది. వయస్సు ఏభై అయిదేళ్లుంటాయని అతని సగం నెరసిన జుత్తే తెలుపుతూంది. కండ్లు ఎర్రగా ఉన్నాయి. బహుశా క్లబ్బులో కాస్త మందు పుచ్చుకుని వచ్చినట్లున్నాడు, కాస్త ఊగుతున్నాడు. నన్నోసారి ఎగాదిగా చూసేడు.

"వీడు నీ పాత రంకు మగడా? నీ పనే బాగుంది, కావల్సినప్పుడల్లా ఓ రంకు మగడు దొరుకుతాడు. నాకు కావాలన్నా, డబ్బిస్తానన్నా ఒక మంచి ముండ దొరికి చావదే! నీదే అదృష్టమంతా— గుడ్— కారీ ఆన్" అని ఊగుకుంటూ లోన గదిలోకిపోయి తలుపేసుకున్నాడు. సిగ్గుతో సంయుక్త తల వాలిపోయింది.

"ఇదీ వరస— వఠి అమమానవు మనిషి. అంత తన పురుషత్వం మీద తనకు నమ్మకంలేని వాడు పడుచు పిల్లను పెండ్లాడడమెందుకు? ఇంటికే స్నేహితులూ బంధువులూ వచ్చినా ఇట్లాంటి కారుకూతల్నే కూసి అందర్నీ అవమానపరుస్తాడు. నాకు తల కొట్టేసినట్లవుతుంది. ఒక్కొక్కప్పుడు అతని మాటల్నీ, చేష్టల్నీ భరించలేక చావాలనిపిస్తుంది", అని పాపం సంయుక్త కంట నీరు పెట్టుకుంది.

ఆ సమయంలో అమాయకురాలైన సంయుక్త ఆవేదనను చూస్తుంటే, నా కెంత ఆవేశం కల్గిందంటే ఆ గదిలోకి పోయి ఆ నాగఫణిని చంపేద్దామనుకున్నా—గాని తమాయించుకున్నాను. వెళ్లిపోవడానికి లేవగానే సంయుక్త నన్ను వీలున్నప్పుడల్లా మధ్యాహ్నం వేళల్లో వచ్చి తనని చూసి తన యోగక్షేమాలను కనుక్కొని పొమ్మంది. సరేనని నా గదికి బయలుదేరేను.

ఆ తరువాత నేను వీలు చిక్కినప్పుడు మధ్యాహ్నం వెళ్లి ఆమెతో మాట్లాడి సాయంత్రం అయిదు గంటలయేలోగా ఆమె భర్తకు ఎదురు పడకుండా తిరిగి వచ్చేస్తుండేవాణ్ని.

## శవం



"సార్, మెడికల్ కాలేజీ వాళ్లు అర్జంటుగా ఒక శవాన్ని పంపమని ఫోన్ చేశారు" అంది నర్సు.

"ఇప్పుడే కదా పేషెంట్ వచ్చింది. ఒక గంట ఆగమని చెప్పు" విసుక్కున్నాడు డాక్టర్.

– పి.వెంకటేష్‌యాదవ్
(కల్వరాల)

క్రమేపీ ఆమె వివాహిత అన్న విషయాన్ని మరచి, ఆమెను నా చేతుల్లోకి తీసుకుని ముద్దులాడాలన్న కోరిక విజృంభించ నారంభించింది.

ఒకనాటి మధ్యాహ్నం మూడు గంటల సమయంలో నేను సంయుక్తతో మాట్లాడుతుండగా వీధిలో ఇంటిముందర ఆటో ఆగిన చప్పుడైంది. కొంపదీసి నాగఫణి వచ్చేసేడేమోనని జంకు కల్గి లేచి కిటికీ ప్రక్కగా నించున్నాను. మరేం ఫర్వాలేదని నాకు చెప్పి తలుపు తీసుకుని గేటు వద్దకు వెళ్లింది సంయుక్త.

ఆ ఆటోలో ఎవ్వరూ లేరు. ఆ ఆటో డ్రయివరు గేటు వద్దకు వచ్చేడు. వాడు ఓ విధంగా ఓ పెద్ద రౌడీలా తోచేడు నాకు. మన సినిమాల్లో స్మగ్లర్ల నాయకుడి వద్ద కుడి భుజంగా మండి 'యస్ బాస్' అనే దోపిడీ హంతకుడిలా ఉన్నాడు. సుమారుగా చెయ్యెత్తు మనిషి. ఎత్తుకు తగ్గ బలమైన శరీరం, పెద్ద ముఖం, బండ పెదవులు, సన్నని మీసం— వయస్సు సుమారు ముప్పై లోపే. ఖాకీ పాంటు, ఖాకీ బుష్ షర్టు వేసుకున్నాడు.

సంయుక్తని చూచి వాడేమో అన్నాడు. ఆమె చికాకుగా ఏదో చెప్పింది. వాడు చిరునవ్వుతో మళ్లీ ఏదో అన్నాడు ఆమె విసురుగా ఇంట్లోకి వచ్చింది.

''ఆటో డ్రయివర్లతో వచ్చిన చిక్కే ఇది. నిన్న సైఫాబాదు నుండి వచ్చేను. ఏభై రూపాయల నోటిస్తే చిల్లర లేదని మళ్లీ వస్తానని చెప్పి పోయేడు. ఆ పోవడం మళ్లీ వేళకాని వేళ ఇప్పుడు తగలడ్డాడు'' అని లోనికి వెళ్లి డబ్బును తెచ్చి వాడి చేతిలో పెట్టి పంపించింది.

తిరిగొచ్చి నా ప్రక్కన సోఫాలో కూర్చుని విచారంగా, ఓ విధమైన తెగింపుతో అంది—

''మురళీ! మరి నేనీ ఇంట్లో ఉండలేను. నీ జాడ తెలియక, నువ్వు నన్ను మరచి వేరొకర్ని వివాహం చేసుకుంటావన్న భ్రమతో, దిక్కు తోచక ఈ ముసలాడ్ని కట్టుకుని ఏ సంతోషం లేక గడుపుతున్నా. మరి నాకీ ఐశ్వర్యమూ వద్దు, ఈ కిరాతకుడైన మొగుడూ వద్దు. నన్ను లేవదీసుకుని నీతో తీసుకుని పో''.

''ఏమైంది సంయుక్తా అంత ఆవేశపడ్తున్నావు?''

''ఏమయిందా— నాతోరా నీకు చూపెడ్తా,'' అని లేచి వీధి తలుపు గడియవేసి నన్ను తనతో లోనున్న గదిలోకి తీసుకుని వెళ్లింది.

తన మంచం మీద కూర్చుని—

''నా మొగుడికి అప్పుడప్పుడు నా మీద తెగ వ్యామోహం కల్గి నన్ను రాత్రిల్లా హింసిస్తుంటాడు తన రాక్షస సరసంతో. అప్పటికి గాని అతడికి తృప్తి కలుగదు— చూడు అని తన పయిటను తీసేసి, తన రవికను విప్పేసి ముందుగా తన వీపును చూపెట్టింది. బోర్లా పడుక్కుని. నేను వీపును చూచి నిర్ఘాంతపోయేను.

వీపంతా గోళ్ల రక్కులే— చేతితో బలంగా చరచినట్లు అక్కడ అక్కడ తట్లు తేలున్నాయి.

అయ్యో! ఎంతదుర్మార్గం అన్నాను బాధతో

"అదేమిటే— ఇటు చూడు!" అని మంచం మీద వెల్లకిలా పడుక్కుంది.

ఆమె దబ్బపండ్ల లాంటి వక్షోజాలపై పంటి గాట్లు పడి ఎర్రగా ఉబ్బి ఉన్నాయి. ఆ రాక్షస కృత్యానికి ఆమెపై జాలితో చలించిపోయేను.

ఆమె కండ్లలో నీరు చిమ్మింది. ఆమె నా కళ్లలోని బాధను, సానుభూతిని చూసి తన చేతుల్ని జాచి నా మెడను పట్టుకుని తనమీదకు వాల్చుకుంది. ఆమె వెచ్చని, మృదువైన ఎదనా ముఖానికి హత్తుకోగానే నేను నా నిగ్రహాన్ని కోల్పోయేను.

ఒకటి తరవాత ఇంకొకటి జరిగిపోయింది. కొంత సేపటికి ఇద్దరం అలసిసొలసి వేర్వేరయేం. ఆఖరికి నేనన్నాను.—

"చూడు సంయుక్తా! నీ మొగుడ్ని చంపి తీరుతాను. తరువాత ఇద్దరం కలిసి దూరంగా ఎక్కడికేనా పోదాం. కావాలంటే నన్ను మరే రాష్ట్రానికేనా బదిలీ చేస్తారు. కలిసి ఆనందంగా మరే చింతలూ లేకుండా జీవిద్దాం— ఏం?"

"చంపడమంటే అంత సుళువా— నువ్వు పట్టుబడి జైలు పాలవుతావు. అప్పుడు నిన్నూ పోగొట్టుకుని నేను ఏ ఉరో పోసుకోవాలి".

నేను కాస్సేపు ఆలోచించేను. ఆఖరి మెరపులాంటి ఆలోచన తట్టింది.

"సంయుక్తా! ఇప్పుడు హైకోర్టు ప్రాంతంలో ఏవో గొడవలు జరుగుతున్నాయి కదా— అవకాశం చూసుకుని నీ భర్త నాగఫణి కోర్టు నుంచి వస్తుండగా పొడిచి ఏ గల్లీలోకో పారిపోతాను. అదేదో దుండగులు చేసిన పననుకుంటారు. మరే గొడవా ఉండదు— మరే విచారణా జరగదు".

"ఈ ప్లాను బాగుంది. మరెప్పుడా పని చేయగలవు?" ఆతృతతో అడిగింది.

'నేను ఆ ప్రాంతంలో బీటువేసి పరిస్థితులు గమనించి అంతా సిద్ధమయేక ఒరోజు ముందుగా వచ్చిచెప్తా. నీమీద అనుమానం పోకుండా నువ్వారోజు ఇంటివద్దే ఉందువుగానీ.'

## బాడ్ మమ్మీ

*ఆడ తాబేలు గ్రుడ్లు పెట్టే సమయానికి ఒడ్డుకు వచ్చి గ్రుడ్లు పెట్టి వెళ్లిపోతుంది. తరువాత తన గ్రుడ్ల గురించి కాని తన పిల్లల గురించి గాని పట్టించుకోదు. గ్రుడ్లు సూర్యరశ్మిచే పొదగబడి, పిల్లలు బయటకు వచ్చి తమ ఆహారం తామే సంపాదించుకుంటాయి.*



—డాక్టర్ ఆళ్ల

నేను అయిదు రోజుల తరువాత నాగఫణిని హత్య చేయడానికి అన్ని ఏర్పాట్లు చేసుకుని, ఆ ముందటి రోజు మధ్యాహ్నం రెండు గంటలకు సంయుక్తకు చెప్పడానికని ఆమె ఇంటికి వెళ్లేను.

నేనామె ఇంటికి చేరేసరికి వీధి తలుపు వేసుంది. బహుశా సంయుక్త నిద్రపోతుందేమో అనుకుని, ఆమె పడక గది కిటికీ వద్దకు చేరి వేసున్న కిటికీ తెరను తప్పించి పిలుద్దామనుకునేసరికి గదిలో నుండి మాటలు వినవచ్చేయి.

''త్వరలో మురళి నా మొగుణ్ని చంపితీరుతానన్నాడు రాహుల్!''

''ఆ వెర్రి వెధవని ఎలా నమ్మించగల్గేవు?''

''ఏముంది— చాలా సింపుల్. వాడు చిన్నప్పటి నుండి నా వెనుక పడ్డాడు. నేనంటే వెర్రి ప్రేమ. నేనూ వాడ్ని ప్రేమిస్తున్నానని అనుకుంటున్నాడు. వాడిని నా వెంట కుక్కపిల్లలా తిప్పుకోడం నాకో సరదా. చూసేవుగా వాడి రూపు— పొట్టిగా, దుబ్బుగా బన్ రొట్టిలా మొహం వాడూను! ఏం బాగుంటాడని వాణ్ని ప్రేమించగలను చెప్పు? పైగా వాడికి ఆస్తి, పాడా ఏం లేదు. ఏదో చిన్న ఉద్యోగం— చాలీ చాలని జీతం. నాకింత సంపద కావాలి. నా విలాసాలకే నెలకు రెండువేలు ఖర్చవుతుంది. అందుకేగా బాగా డబ్బున్న ఈ ముసలాడ్ని ఏరికోరి చేసుకున్నాను''.

''అయితే నీ మొగుణ్ని చంపి నిన్నెత్తుకుని పోదామనుకుంటున్నాడా ఆ పిచ్చి వెధవ?'

''రాహుల్! నువ్వు నా గుండెలమీద వాకామంలో తమకంగా చేసిన గాట్లనూ, నీ త్రాగుడు మైకంలో నా వీపుమీద కొట్టిన దెబ్బల దద్దుర్లనూ వాడికి చూపెట్టి, అవన్నీ నా భర్త నాగఫణి రాక్షస సరసంలో చేసి నన్ను హింసించేడని దొంగ కన్నీరు కార్చేను. పాపం మురళి ఎంతో చలించి పోయేడు, నా మీద జాలితో. అంతేగాని నీ మోటు సరసం నన్నెంతో ఉద్రేకపరుస్తుందని, నువ్విచ్చే సంతోషాన్ని వాడు వెయ్యి జన్మలకు కూడా ఇవ్వలేడని వాడికేమెరుక! వాడు నన్ను తాకితేనే నా ఒంటిమీద జెర్రెలు ప్రాకినట్లవుతుందని వాడికేం తెల్సు'' అంది నా ప్రియాతి ప్రియమైన సంయుక్త.

నాకు మతిపోయినట్లయింది. నా మీద నాకే అసహ్యం కల్గింది. నిజంగా వాళ్లన్నట్లుగానే నేను వెర్రి వెధవనే! ప్రేమ పిచ్చివాణ్నే! అందుకే అంత సుళువుగా మోసపోయేను.

కిటికీ తెరను మెల్లగా ఓ కొసను తప్పించి లోనికి చూసేను. సంయుక్త పూర్తిగా నగ్నంగా మంచంమీద పడుకుని ఉంది. ఆమె ప్రక్కన ఓ చిన్న లుంగీతో ఆ ఆటో డ్రయివరు రాహుల్, అంటే ఆనాడు నేను చూస్తుండగా డబ్బులిచ్చి పంపిందే వాడే, పడుక్కుని ఉన్నాడు. ఆమె నడుం మీద ఓ కాలు వేసుకుని మాట్లాడుతున్నాడు. మంచం ప్రక్కన చిన్న టేబిలు, దానిపై విస్కీ సీసా గ్లాసులున్నాయి.

''సంయూ! రేపు నాకు మూడు వందలు కావాలి— ఎలాగైనా ఏర్పాటు చేయాలి''.

''నా మొగుడు చచ్చే వరకు నువ్వాగాలి. ఇంట్లో ఉన్న చిల్లర నోట్లన్నీ నీకిచ్చేనుగా రాహుల్! నా మొగుడు పోయేక బ్యాంకులో ఉన్న లక్ష రూపాయలూ, లక్షల విలువ జేసే ఈ ఇల్లూ, విలువైన నా నగలూ అన్నీ మనవే అవుతాయి. అప్పుడు ఇష్టమొచ్చినట్లు ఖర్చు చేసుకోవచ్చు''.


''అలా వీలు పడదు— రేపు నా కెలాగైనా కనీసం రెండు వందలైనా కావాలి. ఇవ్వకపోతే ఎలా బాదుతానో నీకు తెల్సు కదా. మరి నీ ఇష్టం''.

''సరేలేవోయ్— ఎలాగో సంపాదించి ఇస్తాలే, మధ్యాహ్నం మూడింటికి సరిగారా'' అంది సంయుక్త. సంయుక్త ఇంటి నుండి బయటపడ్డాను. ఆ సాయంత్రమే సుల్తాను బజారులో నాలుగంగుళాల పొడవున్న వాడి చాకును కొని జేబులో పెట్టుకున్నాను.

ఆ రాత్రి నా హత్యా పథకాన్ని పగడ్బందీగా వేసుకున్నాను.

సరిగ్గా మధ్యాహ్నం రెండు గంటల ముప్పై నిముషాలకు సంయుక్త ఇంటికి వెళ్లి ఏవో మాటలమీద ఆమెను పడక గదిలోకి తీసుకుని వెళ్లి, ఆమె ఏమరపాటునుండగా బలంగా నా వద్దున్న చాకుతో మెత్తని గుండెల్లో ఓ పోటు పొడచి, ఆమె చచ్చిపోతుంటే నాకు చేసిన ద్రోహాన్ని గుర్తు చేయాలి. తరువాత ఆటో డ్రయివరు రాహుల్ రాకకు వేచుండి, వాడు గేటు తెరవగానే ఫోనులో పోలీసు కంట్రోల్ రూముకు, ఎవడో ఇంట్లో దూరి ఒంటరిగానున్న ఆ ఇంటి ఇల్లాల్ని హత్యచేసి పారిపోనున్నాడని ఆ ఇంటి అడ్రసిచ్చి, నేను పెరటి త్రోవన వెంటనే పారిపోవాలి. సంయుక్త చచ్చిపోతుంది. రాహుల్ పోలీసులకు చిక్కి ఉరికంబమెక్కుతాడు. ఆ విధంగా నా కక్ష తీరి నా గుండెల్లోని మంట చల్లారుతుంది.

ఆ మరునాటి మధ్యాహ్నం నేను సంయుక్త ఇంటికి వెళ్లేసరికి అక్కడ పోలీసు జీపు ఆగుంది. ఆ ఇంటి ముందర జనం మూగున్నారు. నేను చాలా ఆశ్చర్యంతో



జవాన్ని త్రోసుకుని ఇంట్లోకి వెళ్లేసరికి ఆటోడ్రయివర్ రాహుల్ చేతులకు పోలీసులు బేడీలు వేస్తున్నారు. రాహుల్ అరుస్తున్నాడు.

''నాకు సంయుక్తకు అక్రమ సంబంధమున్నమాట నిజమే, గాని నేను ఆమెను చంపలేదు. నేనెందుకు చంపుతానండి? ఆమె నాకు బంగారు గుడ్లనిచ్చే బాతు! ఎంతో శరీర సౌఖ్యాన్నిచ్చేది. ఖరీదైన విస్కీనిచ్చేది. కావల్సినప్పుడల్లా డబ్బులిచ్చేది. మరామెను చంపుకుంటే నా కన్ని విధాల నష్టం కదండీ?''.

''మరి నీ బట్టల మీద ఆ రక్తం ఎలా వచ్చింది? ఆ కత్తి నీ చేతిలోకెలా వచ్చింది?''

''వీధి తలుపులు తెరిచే ఉన్నాయి. నేను ఆమె గదిలోకి వెళ్లేను. కిటికీ తలుపులన్నీ వేసుండడం వల్ల గది కాస్త చీకటిగానే ఉంది. సంయుక్త నిద్రపోతున్నాదేమోనని మంచం దగ్గరగా పోయి ఆమెను పిలిచి పలకకపోతే, అటు నుంచి నా వైపుకు తిప్పుకున్నాను. అప్పుడా రక్తం నా బట్టలకంటింది. ఆమె గుండెల్లో దిగిన ఆ కత్తిని చూచి వెంటనే నా చేతితో తీసేను. ఈలోగా మీరొచ్చేరు. అంతే జరిగింది సార్— నేనామెను చంపలేదు సార్!''

''దొంగ ముండాకొడకా! తప్ప తాగున్నావు— నీ మాట లెవరు నమ్మమన్నారు.అది ఇంకొకడ్ని మరిగింది కాబోలు, ఆమెతో ఘర్షణపడి ఆమెను చంపేసేవు. ఈ గొడవంతా తెలిసి ఎవరో ఇరుగుపొరుగు వారు మాకు ఫోన్ చేసేరు, ఇప్పుడు ముందుకు వచ్చి చెప్పడానికి భయపడినా. నీ సంగతి కోర్టులో తేలుతుందిలే. నిన్ను రెడ్ హేండెడ్ గా పట్టుకున్నాం. కత్తిమీద నీ వేలిముద్రలున్నాయి. ఇంకేం కావాలిరా? నిన్ను ఉరికంబమెక్కించడానికి, పదరా రాస్కెల్!'' అని పోలీస్ ఇన్స్పెక్టర్ రాహుల్ని తన వెంట జీపులో ఎక్కించుకుని పోయేడు.

నేను మెల్లగా ఆ జనంలో నుండి జారుకున్నాను. ఈ జన్మలో మరెవర్నీ ప్రేమించకూడదని ఓ నిర్ణయం తీసుకున్నాను.

కాని నాకింత వరకూ తెలియని విషయమొకటి ఉండిపోయింది— సంయుక్తను ఎవరు చంపేరు? డబ్బివ్వలేదని కోపం వచ్చి రాహులే నిజంగా ఆమెను ఆ త్రాగుడు మైకంలో చంపేసేడా? లేక ఆమె పడక గదిలో రహస్యంగా ఓ మైక్ అమర్చి దూరంగా తన పడక గదిలో నాగఫణి ఆమె రసిక ముచ్చట్లన్నీ రికార్డు చేసి, తన గుండె మంటను అణచుకోలేక ప్రతీకారంగా ఆమెను చంపి, ఆ హత్యను నేను అనుకున్నట్లుగా నే తనూ తలచి, తెలివిగా రాహుల్పైన మోపేడా? ఏమో!

*

